ఆలోచనలకు ఆయుధం
నవతెలంగాణ
నిఖార్సైన తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
బుధవారం 02 ఆగస్టు 2023

సమావేశం ప్రతినెలా నిర్వహించాలి

• ఆర్మూర్ మున్సిపల్‌కు హైకోర్టు ఆదేశం



నవతెలంగాణ-ఆర్మూర్

ప్రతినెలా మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించాలని రాష్ట్ర హైకోర్టు ఆర్మూర్ మున్సిపల్‌ను ఆదేశించింది. ఈ మేరకు సీఎండీకి ఆదేశాలు జారీ అయ్యాయి. మూడు నెలలకోసారి మీటింగ్ పెడుతున్నారని పట్టణంలోని 19వ వార్డు కౌన్సిలర్ జీవి నరసింహరెడ్డి హైకోర్టులో పిటిషన్ వేయగా విచారణ చేపట్టి ఈ మేరకు ఆదేశాలు జారీచేసినట్టు తెలిపారు. ఇకనుంచైనా ప్రతినెల సమావేశాన్ని నిర్వహించాలని మున్సిపల్ అధికారులను ఆయన కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలోని మద్నూర్ గ్రామ ఉపసర్పంచ్ విట్టల్ తల్లి ఇటీవల మరణించగా.. వారి కుటుంబాన్ని ఎమ్మెల్యే హన్మంత్‌షిండే మంగళ వారం పరామర్శించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని గాండ్ల సంతోష్ కుమారుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించా అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్ సురేష్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బస్సీ పటేల్ సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, మాజీ చైర్మన్ విజయ్, స్థానిక నాయకులు తదితరులున్నారు.

రోడ్లకు కోత



బషీరాబాద్- దోన్‌పాల్ రోడ్డులో నడుకకు వీలులేకున్న బీటి రోడ్డు

• వరదల దాటికి ఆనవాళ్లు కోల్పోయిన రహదారులు
• తెగిన రోడ్లులో ప్రయాణం సాగేదెట్లా..?
• ఇక్కట్లు పడుతున్న వాహనదారులు
• వ్యవసాయ పనులకు వెళ్లలేక రైతుల ఇబ్బందులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయి. ఎక్కడికక్కడ కోతలకు గురవడంతో పాటు, పలుచోట్ల కొట్టుకు పోయి ఆనవాళ్లు లేకుండా మారాయి. దీంతో రోడ్లపై ప్రయాణం చేసేందుకు వాహనదారులకు ఇక్కట్లు ఎదురవుతు న్నాయి. పొలాలకు వెళ్లే రోడ్లు సైతం దెబ్బతినడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా రాగా.. మొదలవ్వడమే భారీ వర్షాలతో మొదలయ్యాయి. ఒక్కోరోజు 15 సెంటీ మీటర్లకు పైగా వర్షాపాతం నమోదు అయ్యింది. భారీ వర్షాలకు కొంది రోజుల్లోనే మండలంలోని చెరువులు అన్ని జలకళను సంతరించుకొని పొంగిపొర్లాయి. సాధారణం కంటే భారీ వర్షాలు కురవడంతో వరద ఉప్పొంగింది. అలుగుపారిన నీళ్లకు వరద తోడయింది. దీంతో వరద ఉధృతికి రోడ్లు తీవ్రంగా ధ్వంసమైయ్యాయి. కమ్మర్‌పల్లి మండలం వ్యాప్తంగా పలు చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. పలు చోట్ల కోతకు గురికాగా, మరికొన్ని చోట్ల కొట్టుకుపోయి ఆనవాళ్లు లేకుండా మారాయి.

ఎక్కడికక్కడ రోడ్లు ధ్వంసం

మండలంలోని బషీరాబాద్ గ్రామం నుండి మోర్తాడ్ మండలం దోన్‌పాల్ వెళ్లే బీటి రోడ్లు భారీ వర్షాపు వరదల వల్ల కొతకు గురైంది. కమ్మర్‌పల్లి నుండి మోర్తాడ్ మండలం వడ్యాట్ వెళ్లే బీటి రోడ్డులో వడ్యాట్ సమీపంలో కల్వర్టు కొతకు గురై రోడ్డు తెగిపోయింది. వడ్యాట్ రోడ్డును వెంటనే స్థానిక సర్పంచ్ కొతకు గురైన చోట తత్కాలికంగా మొరం పోసి రోడ్డును పునరుద్దరించారు. బషీరాబాద్-దోన్‌పాల్ బీటి రోడ్డు కొతకు గురవ్వడమే కాకుండా చాల చోట్లకొట్టుకుపోయింది. ఇది బీటి రోడ్డేనా? అన్న అనుమానం కలిగేలా ప్రస్తుతం ఈ రోడ్డు తయార య్యింది. గత సంవత్సరం భారీ వర్షాలతో ఉప్లూర్-జిగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామాల మధ్య బీటి రోడ్డు తెగిపోయింది. దమ్మన్నపేట్-నాగాపూర్ గ్రామాల మధ్య బీటి రోడ్డు సగం వరకు కోతకు గురైంది. ఉప్లూర్-తిమ్మాపూర్ రోడ్డు కల్వర్టుల వద్ద కొతకు గురై పెద్ద గుంతలు ఏర్పాడ్డాయి. ఈ రోడ్డు రెండు సార్లు భారీ వర్షాలకు తెగిపోయాయి. దీంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వెంటనే స్పందించిన అధికారులు రాకపోకలు పునరుద్ధరించేందుకు బీటి రోడ్డు తెగినచోట పైపులు వేసి మొరం పోయించి చదును చేయించారు. అయితే ఇటీవల కురిసిన అతి భారీ వర్షాలతో ఉప్లూర్ నల్ల చెరువు పెద్ద ఎత్తున అలుగు పారడంతో ఆ వరద ప్రవహన్ని తట్టుకొలేక డబ్బా వెళ్లే బీటి రోడ్డు అనవాళ్లు లేకుండా కొట్టుకుపోయింది. గత సంవత్సరం పైపులు వేసి మొరం పోసినచోటనే వరద ప్రవహనికి బీటి మొత్తం కొట్టుకుపోయి రోడ్డు తెగిపోయింది. రోడ్డులో వరదల మూలంగా పెద్ద పెద్ద గుంతలు ఏర్పాడ్డాయి. దమ్మన్నపేట్-నాగాపూర్ బీటి రోడ్డు సగం వరకు కొతకు గురైంది. కమ్మర్‌పల్లి శివారులోని వరదకాలువ అండర్ సైఫాన్ ద్వారా వరద కాలువ దిగువన కల్వర్టునుండి వర్షం నీరు ఉప్లూర్ చెరువులోకి వెళ్తుంది. అయితే వరద ప్రవహం పెద్ద ఎత్తున రావడంతో దమ్మన్నపేట్-నాగాపూర్ మధ్య నుండి ఉప్లూర్ చెరువులోకి నీరు వెళ్లే కల్వర్టు వరద ప్రవహన్ని తట్టుకొలేక, కల్వర్టు పైనుండి నీరు పారడంతో బీటి రోడ్డు సగం వరకు కోతకు గురైంది. రెండు రోజుల పాటు ఇరు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గత సంవత్సరం కూడా భారీ వర్షాలకు ఇదే పరిస్థితి ఏర్పడింది.



బషీరాబాద్-దోన్‌పాల్ గ్రామల మధ్య కొతకు గురైన రోడ్డు

వరద ప్రవహం తగ్గినా.. ఈ రోడ్డు గుండా ప్రయాణించేందుకు వాహనదారులు భయపడాల్సి వస్తోంది. రోడ్డు గుండా వెళ్లే సమయంలో ఎక్కడా ఆ సగం రోడ్డు కాస్తా కుంగిపోతుందోనని. ఈ రోడ్లలో రాకపోకలు సాగించకుండా ఇప్పటికి గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ను రోడ్డుకు అడ్డుగా పెట్టారు. అయితే వ్యవసాయ పనుల కోసం ట్రాక్టర్లు, ఇతర పెద్ద వాహనాలను తీసుకు వెళ్ళాలేని పరిస్థితి నెలకొనడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

పెద్ద ఎత్తున నిత్యం రాకపోకలు.. రైతులకు మరింత ఇబ్బందులు

వర్షాల వల్ల దెబ్బతిన్న ఈ రోడ్లు గుండా పెద్ద ఎత్తున నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తారు. రాకపోకలు సాగించే ప్రజలతో పాటు ముఖ్యంగా తమ పంట పొలాలకు వెళ్లే రైతుల సంఖ్య కూడా అధికంగా ఉంటుంది. ప్రస్తుతం వరి నాట్లు వేసే పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. నాట్లు ముమ్మరంగా సాగుతున్న తరుణలో భారీ వర్షాలకు రోడ్డు దెబ్బతినడంతో రైతులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పంట పొలాల వద్దకు వాహనలపై ఎరువులు, ఇతరత్ర వ్యవసాయ పనిముట్లు తీసుకు వెళ్లేందుకు అస్కారం లేకపోవడంతో కాలినడకన వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. కాలినడకన వెళ్లితే తప్ప తెగిపోయిన రోడ్లను దాటలేని పరిస్థితి నెలకొంది. తెగిన బీటి రోడ్డు పక్కను నుండి వెళ్ళాలన్నా పక్కనే ఉన్న భూముల్లో పంటలు వేసి ఉండడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. పంటలను తొక్కుతూ వాటి గుండా రాకపోకలు సాగించలేని స్థితిలో రైతులు ఉన్నారు.

అధికారులు స్పందించి తాత్కాలిక ప్రతిపాదికన కాకుండా శాశ్వత ప్రతిపదికన నిలిచే విధంగా పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఉప్లూర్-డబ్బా, దమ్మన్నపేట్-నాగాపూర్, ఉప్లూర్-తిమ్మాపూర్ గ్రామాల మధ్య వరద ప్రవహం అధికంగా ఉండే చోట్ల కల్వర్టులను కాకుండా హైలేవల్ బిడ్జిను నిర్మించాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.



సగం వరకు కొతకు గురైన దమ్మన్నపేట్-నాగాపూర్ రోడ్డు..



కమ్మర్‌పల్లి-వడ్యాట్ గ్రామాల మధ్య కోట్టుకుపోయిన కల్వర్టు సైడ్ గోడ..



రాకపోకలు సాగకుండా అడ్డుపెట్టిన పంచాయతీ ట్రాక్టర్



నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు, మిషన్ భగీరథ కార్మికులు

ప్రభుత్వానికి అవార్డులు పస్తుల్లో కార్మికులు

• మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి • సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)

'రాష్ట్ర వ్యాప్తంగా మిషన్ భగీరథ పథకంలో ఎలక్ట్రిషన్, ఆపరేటర్స్, వాల్వ్ ఆపరేటర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్, వాచ్ మెన్, సూపర్వైజర్, తదితర హెూదాల్లో సుమారు 16 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. భగీరథ కార్మికుల శ్రమ ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వానికి బహుమతులు వచ్చాయి. కానీ కార్మికులు మాత్రం దుర్భర జీవనం గడుపుతున్నారు. వారికి కనీస వేతనం అమలు చేయాలని' సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ బాన్సువాడ పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళ వారం ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వచ్చి బస్టాండ్ వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఖలీల్ మాట్లాడుతూ మిషన్ భగీరథ కార్మికుల వేతనాల పెంపు జీవో నెంబర్ 60 లేదా జీవో 11ని అమలు చేయాలన్నారు. మిషన్ భగీరథ పథకం నిర్వహణ తీసుకున్న కంపెనీలు కార్మికుల పొట్ట కొడుతున్నాయని, కనీస వేతనాలు అమలు చేయాల్సిన ప్రభుత్వ అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. దీని ఫలితంగా మిషన్ భగీరథ కార్మికులు తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం కంపెనీలకు ఇచ్చే ఎస్ఎస్ఆర్ రేట్లు 18 వేలకు పైగా చూపిస్తున్నారని, కానీ కార్మికులకు మాత్రం 8500 నుండి 12 వేల రూపాయల లోపు మాత్రమే వేతనం చెల్లిస్తున్నారని తెలిపారు. లైన్ మెన్ పరిస్థితి మరింత దయణీయంగా మారిందని, వారికి వచ్చే 8500 వేతనంలో పెట్రోల్ అలవెన్స్ కిందనే సుమారు 3000 రూపాయలు ఖర్చవుతుందన్నారు. సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని నీళ్ళు అందించడం అనేది భగీరథ స్కీంలోనే నడుస్తోందని అన్నారు. ఎనిమిది గంటల పని విధానం అమలు చేసి కనీసవేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రవీందర్, మిషన్ భగీరథ యూనియన్(సీఐటీయూ) అధ్యక్షుడు రూప్ సింగ్, కార్యదర్శి పండరి బాల్‌రాజ్, మొగులయ్య అంబర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పెండ్లికావట్లేదనే మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



నవతెలంగాణ-తాడ్వాయి

పెండ్లి కావడం లేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన తాడ్వాయి మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తాడ్వాయి గ్రామానికి చెందిన జౌడీ శ్రీకాంత్‌రెడ్డికి (26) రెండు సంవత్సరాల క్రితం పెళ్లి సంబంధం కుదిరి పలు కారణాలతో రద్దు అయింది. అప్పటినుంచి పెళ్లి సంబంధాలు రావడంలేదని తమ పెళ్లి అయితదో కాదు అని తీవ్ర మనస్థాపానికి గురై తన వ్యవసాయ పొలం వద్ద సోమవారం రాత్రి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులు గమనించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. తండ్రి జౌడీ బాల్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టనట్టు పోలీసులు తెలిపారు.

టమాటా కేజీ రూ.200

• కిలోకు బదులు పావుకిలో కొనుగోలుతో సరి



ఎడపల్లి సంతలో..




వర్నిలో

నవతెలంగాణ-డిచ్‌పల్లి/వర్ని/ఎడపల్లి

టమాటా ధర రోజురోజుకూ పెరుగుతోంది. కేజీ ధర రూ.100 మార్క్ ధాటిన తర్వాత క్రమంగా పెరుగుతూనే ఉంది తప్ప.. తగ్గడం లేదు. ప్రస్తుతం ఏకంగా ధర రూ.200 పలుకుతోంది. మే నెలలో కురిసిన అకాల వర్షాలతో టమాట పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో ఇప్పుడు రావాల్సిన దిగుబడి నిలిచిపోయింది. కొంత మేర మిగిలిన పంట ప్రస్తుతం మార్కెట్‌కు వస్తుండగా.. డిమాండ్‌కు తగ్గ సరఫరా లేక ధర అమాంతంగా పెరిగిపోతూనే ఉంది. ధర కిలో రూ.200 దాటడంతో కిలో తీసుకునే వారు సైతం పావుకేజీతో సరిపెట్టుకుంటున్నారు. వాటిని కూడా పొదుపుగా వాడుతుండటం గమనార్హం. టమాట కంటే చికెన్, కోడి గుడ్ల ధరలు తక్కువగా ఉన్నట్టు వినియోగదారులు పేర్కొంటున్నారు. మంగళవారం డిచ్‌పల్లి, ఎడపల్లి, వర్ని తదితర మండలాల్లోని పలు గ్రామాల్లో నిర్వహించిన సంతల్లో టమాట ధరలు చూసి వినియోగ దారులు అవాక్కయ్యారు. ధరలు ఇలా పెరిగిపోతుంటే ఏం తినేట్టు లేమంటూ నోరెళ్లబెట్టుకున్నారు.

కవిని సన్మానించిన కలెక్టర్



కవిని సన్మానించిన కలెక్టర్, అధికారులు

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

దాశరధి పురస్కా రాన్ని పొందిన ప్రముఖ సంస్కృ తాంధ్రవిదాత్వా కవి, అష్టావధాని డా. ఆయాచితం నటేశ్వర శర్మను మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సము చితంగా సత్కరించారు. జులై 22 న దాశరధి 99వ జయంతి సందర్భంగా హైదరాబాద్ లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక, క్రీడా శాఖామాత్యులు డా. శ్రీనివాస్ గౌడ్ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కామారెడ్డి వాసి దాశరథి పురస్కారాన్ని పొంది జిల్లా ఖ్యాతిని రాష్ట్ర స్థాయిలో ఇనుమడింపజేసిన ఆయాచితం సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డా . శంకర్, అంబిర్ మనోహర్ రావు, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యా, వైద్యం, రోడ్లతోనే అభివృద్ధి

• నా కంఠంలో ప్రాణం ఉన్నంతవరకూ జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తా
• డిగ్రీ కాలేజీ మంజూరుతో ఇక్కడి వారి కల నెరవేరింది
• కాలేజీ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే హన్మంత్‌షిండే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్ షిండే

నవతెలంగాణ-మద్నూర్

'విద్యా, వైద్యం, రోడ్లు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి కేసీఆర్ బలంగా నమ్ముతారు. దాంట్లో భాగంగానే ప్రత్యేకంగా విద్య కోసం గురుకులాలు, కాలేజీలు, వైద్యం కోసం మెడికల్ కాలేజీలు, ఆస్పత్రులు, ఊరూరా రోడ్లువేయించారని, దీంతో పాటుమంచి నీటి, సాగునీటి సమస్యలను తీర్చారని' ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. మద్నూర్ మండలానికి మంజూరైన డిగ్రీ కాలేజీని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణంలో ఏర్పాటు చేస్తూ మంగళవారం షిండే ప్రారంభించారు. ఈ సందర్భంగా మైథిలి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. 'నా కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా. జుక్కల్ ప్రజల సేవ కోసమే ఉద్యోగాన్ని వదులుకొని రాజకీయాల్లోకి వచ్చానని ఏఏ మండలాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు అవసరమో వాటి గురించి తనకు అన్ని విధాలుగా అవగాహన ఉందని తెలిపారు. జుక్కల్ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో ఎంపీపీ వాగ్మారే లక్ష్మీబాయి, జెడ్పిటిసి అనిత కతలయ్య, మద్నూర్ సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు సురేష్, డాక్టర్ బండి వార్ విజయ్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ దిగంబరావ్ పాటిల్, మద్నూర్ సింగిల్ విండో మాజీ అధ్యక్షులు పాకల విజయ్, బిఆర్ఎస్ పార్టీ మద్నూర్ మండల అధ్యక్షులు బస్సీ పటేల్ డోంగ్లి బిఆర్ఎస్ మండల అధ్యక్షులు శశాంక్ పాటిల్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్, లెక్చరర్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అడ్మిషన్ అందజేత

డిగ్రీ కాలేజీని ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే షిండే తరగతి గదులను పరిశీలించారు. ఓ బాలికకు అడ్మిషన్ ఇచ్చారు. ఈ క్రమంలో ఎంపీపీకి కుర్చీ వేయకపోవడం పట్ల అధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమైయ్యాయి.

నెరవేరిన మండలవాసుల కల

మద్నూర్ ఉమ్మడి మండల వాసుల కల నెరవేరింది. డిగ్రీ కాలేజీ ఏర్పాటు కోసం ఏండ్లుగా వినతిపత్రాలు అందజేసి ఉద్యమాలు, ఆందోళనలు చేపట్టారు. స్థానికంగా డిగ్రీ కాలేజీ లేకపోవడంతో ఇక్కడి విద్యార్థులు, ముఖ్యంగా బాలికలు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజల కోరిక మేరకు ఎమ్మెల్యే హన్మంత్ షిండే ప్రత్యేక కృషి చేసి డిగ్రీ కాలేజీ మంజూరు చేయించినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ప్రయివేటు వర్కర్‌ల అడ్డగింత

• తమకు సహకరించాలని జీపీ కార్మికుల విజ్ఞప్తి



ప్రయివేటు కార్మికులతో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

నవతెలంగాణ-బోధన్

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గత 27 రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పంచాయతీ కార్మికులు కలెక్టర్ కార్యాలయ ముట్టడిని సైతం నిర్వహించారు. అయినా ప్రభుత్వంలో కనీస స్పందన లేదు. పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండడంతో గ్రామంలో పారిశుధ్యం మరుగున పడింది. దాంతో సాలూర మండల కేంద్రంలో మంగళవారం గ్రామపంచాయతీ కార్యదర్శి, ప్రజా ప్రతినిధులు తాత్కాలిక కూలీలతో పారిశుధ్య పనులు నిర్వహిస్తుండగా సమాచారం తెలుసుకున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్, గ్రామపంచాయతీ కార్మిక సంఘం అధ్యక్షులు రేఖ, కార్యదర్శి సాగర్, కార్మికులు అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయలేనప్పుడు మా పనులను మీరెలా చేస్తారని వారిని నిలదీశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించే వరకు ఎవరు కూడా గ్రామాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టరాదని హెచ్చరించారు. చాలీచాలని వేతనాలతో పని చేస్తున్న తమకు ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదని అన్నారు.గ్రామంలో నెలకొన్న పారిశుధ్య సమస్యలు ప్రభుత్వం దృష్టికి వెళితేనే తమ సమస్యలు పరిష్కారం అవుతాయని అంత వరకు ఎలాంటి పనులు చేపట్టవద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు శంకర్ గౌడ్ పంచాయతీ అధికారులతో అన్నారు. ఈ నిరసనలో కార్మికులు గంగారాం, శంకర్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు నిరంతరం కొనసాగించాలి

• కార్యవర్గ సమావేశంలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా రెడ్ క్రాస్ సంస్థ సేవలు నిరంతరం కొనసాగించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సి.పి.ఆర్. కార్యక్రమాలను జిల్లా, డివిజన్ స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి మండలంలో జూనియర్ రెడ్ క్రాస్ సొసైటీ, యూత్ రెడ్ క్రాస్ సొసైటీ, నూతన సభ్యత్వాలను ముమ్మరంగా చేపట్టాలని అన్నారు. ఇటీవల వర్షాలకు ప్రమాదకరంగా ఉన్న ఇండ్లకు తాటిపత్రులను అందజేయాలని కోరారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా రోడ్డు భద్రతపై గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలన్నారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తలను సభ్యులుగా చేర్పించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రభలకుండా గ్రామ స్థాయిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని తెలిపారు. హరితహారంలో భాగంగా తులసి, నేలఉసిరి ,మునగ, బొప్పాయి, కరివే పాకు వంటి 5 రకాల ఔషధ మొక్కలు ఇంటింటికి పంపిణీచేసే విధంగా చూడాలన్నారు. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజిమెంట్, ఎకో బ్రిక్స్ పై అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 16 నుంచి 14 రోజుల పాటు కుష్టువ్యాధి నిర్మూలనపై వైద్యారోగ్య శాఖా ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జిల్లాలోని 3 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మహిళలు అధిక సంఖ్యలో వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జన ఔషధ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న డయాగ్నస్టిక్ హబ్‌లో 57 రకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

జిల్లా రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ రాజన్న మాట్లాడుతూ.. రెడ్ క్రాస్ సంస్థ గత మూడు మాసాలలో జిల్లాలోని 22 మండలాలలో 48 క్యాంపులు నిర్వహించి వివిధ రకాల కార్యకలాపాలు చేపట్టామని, 380 యూనిట్ల రక్త నిధిని సేకరించామని తెలిపారు. ఈ సమావేశంలో సంస్థ వైస్ చైర్మన్ నాగరాజు గౌడ్, ప్రధాన కార్యదర్శి రఘుకుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంజీవ రెడ్డి, కోశాధికారి దస్తి రామ్, కార్యవర్గ సభ్యులు వైద్యుడు విక్రమ్, నరసింహం, మానేటి కృష్ణ, నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

తల్లి పాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుంది

అంగన్వాడి సూపర్వైజర్ వెంకట రమణమ్మ

నవతెలంగాణ ఆర్మూర్

తల్లి పాలలో వ్యాధి నిరోధక శక్తి ముఖ్యంగా కాల్షియం అధికంగా ఉంటుందని మండలంలోని పి ప్రీ గ్రామ సెక్టార్ సూపర్వైజర్ వెంకట రమణమ్మ తెలిపారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మంగళవారం అంగన్వాడి సెంటర్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులకు, బాలింతలకు, రెండు సంవత్సరాల లోపు పిల్లల తల్లులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆరు నెలల వరకు తల్లిపాలు తాగించాలని, బిడ్డకు అవసరమైన విటమిన్స్ ,మినరల్స్ తల్లిపాలలో లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలు, అంగన్వాడి టీచర్ రాణి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జీవన భృతి వెంటనే ఇవ్వాలి : ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ-ఆర్మూర్

రాష్ట్ర క్యాబినెట్ ప్రకటించిన ఆసరా పెన్షన్ జీవన భృతి రూ 2016/- వెంటనే ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. సూర్య శివాజీ డిమాండ్ చేశారు ఈ సందర్భంగా పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీడీ కార్మికులకు, కమిషన్ దార్లకు జీవన భృతి ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర ఐటి శాఖ మంత్రి కే టి రామారావు ప్రకటించారన్నారు. నాలుగు సంవత్సరాలు ఆలస్యంగానైనా నిర్ణయన్ని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికుల పోరాటల ఫలితంగానే జీవన భృతి సాదింకోవటం బీడీ కార్మికుల విజయం అని అన్నారు. సమావేశంలో యూనియన్ ఏరియా నాయకులు గంజి రాజారాం, ఎస్ వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఐటీ హబ్‌ను సందర్శించిన గ్లోబల్ లాజిక్ సంస్థ

- ఎమ్మెల్సీ కవిత ఆహ్వానం మేరకు వచ్చిన సంస్థ ప్రతినిధులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ పార్టీ ఎన్ఆర్ఐ గ్లోబల్ కో ఆర్డినేటర్ మహేష్ బిగాలతో కలిసి గ్లోబల్ లాజిక్ సంస్థ ప్రతినిధులు కృష్ణ, సందీప్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. బీఆర్ఎస్ పార్టీ ఎన్ఆర్ఐ గ్లోబల్ కోఆర్డినేటర్ మహేష్ బిగాల ఐటీ హబ్‌లో సదుపాయాలను వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా 13 దేశాల్లో గ్లోబల్ లాజిక్ సంస్థ విస్తరించి ఉందని, మన దేశంలో 30వేల మంది ఈ సంస్థలో పనిచేస్తుండగా ఒక్క హైదరాబాద్‌లోనే 3వేల మంది పని చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో ధర్పల్లి జడ్పీటీసి బాజిరెడ్డి జగన్, టాస్క్ ప్రతినిధులు శ్రీనాధ్ రెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.



ఐటీ హబ్‌ను పరిశీలిస్తున్న సంస్థ ప్రతినిధులు



మాట్లాడుతున్న గైనకాలజిస్టు

మహిళలు ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలి

- హెల్త్‌క్యాంప్‌లో గైనకాలజిస్టులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచించారు. మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాందేవ్ వాడలోని ట్రస్టు భవనంలో మహిళల కోసం ప్రత్యేక హెల్త్ క్యాంపును (ఆరోగ్య శిబిరాన్ని) మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ప్రముఖ గైనకాలజిస్టులు డాక్టర్ కే. పార్వతి, డాక్టర్ సుజాత, డాక్టర్ సూరి పాల్గొన్నారు. మహిళలు రక్తహీనత, పోషకాహార లోపాలతో ఉన్నారని తెలిపారు. మహిళలు తమ కుటుంబ సభ్యుల ఆరోగ్యం గురించి ఆలోచిస్తారు కానీ తన గురించి పట్టించుకోరని, ఇది మంచిది కాదని అన్నారు. ఆరోగ్యంపట్ల అశ్రద్ధచేస్తూ క్యాన్సర్ లాంటి ప్రమాదకర వ్యాధులకు లోనవుతున్నారని డాక్టర్ పార్వతి అన్నారు. జ్వరం, దగ్గు, జలుబు, గొంతు నొప్పి, ఇతర సీజనల్ వ్యాధుల ప్రమాదం పొంచి ఉందని, వీటి పట్ల అప్రమత్తతతో ఉండాలని డాక్టర్ సుజాత అన్నారు. దాదాపుగా 64 మంది మహిళలు ఈ క్యాంపులో పాల్గొన్నారు. ఈ క్యాంపు నిర్వహణలో ట్రస్టు కార్యదర్శి కే. రామ్మోహన్‌రావు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ ప్రధాన కార్యదర్శి మదన్ మోహన్, ట్రేడ్ యూనియన్ నాయకులు నూర్జహన్, రమేష్ బాబు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ రామ్మోహన్రావు జన విజ్ఞాన వేదిక బాధ్యులు నర్రా రామారావు, ప్రసాద్ రావు, నర్సింలు శిబిరాన్ని పరిశీలించారు. హెల్త్ క్యాంపులో ఎం గోవర్ధన్, సిర్ప లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

స్నేహ సొసైటీలో బోనాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని మారుతినగర్ లో గల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో బోనాల జాతరను ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్నేహ టార్గెటెడ్ ఇంటర్వెన్షనల్ (ఎయిడ్స్ నివారణ కార్యక్రమం) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఐటి ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్ .సిద్దయ్య హాజరై ప్రసంగించారు. ప్రతి సంవత్సరం బోనాల పండుగను నిర్వహిస్తున్నామని తెలిపారు. శివపత్తులు, మహిళా సెక్స్ వర్కర్లు, జోగినిలు ఊరేగింపుగా మారుతినగర్ లోని స్నేహ సొసైటీ నుంచి బంగారు మైసమ్మ కాలనీలో బంగారు మైసమ్మ గుడి వరకు బోనాలు తీశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ షేక్ మొయిజ్ అహ్మద్, ప్రిన్సిపాల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ రాజేశ్వరి, మహిళా సెక్స్ వర్కర్లు, ఔట్ రిచ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



బోనాలతో వెళ్తున్న సిబ్బంది

సీఎం కేసీఆర్. బాజిరెడ్డిని కలిసిన బంజారా నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

సీఎం కేసీఆర్‌కు, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌కి నిజామాబాద్ జిల్లా ఆర్టీసీ ఉద్యోగుల తరఫున జిల్లా బంజారా నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బాజిరెడ్డి గోవర్ధన్ ఆధ్వర్యంలో సీఎం క్యాంప్ కార్యాలయం (ప్రగతి భవన్)లో పలు సమస్యలపై సీఎం కేసీఆర్‌ను కలిశారు. కలిసిన వారిలో బానోత్ ప్రేమ్ నాయక్, రామావత్ మోహన్ నాయక్,బాదావత్ శంకర్ నాయక్, బానోత్ గోపాల్ నాయక్, భానోత్ శ్రీరామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

మంత్రిని సన్మానించిన గిరిజన పుత్రులు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

అంబేద్కర్ సచివాలయం సెక్రటేరియట్ కార్యాలయంలో రాష్ట్ర మంత్రివర్యులు సత్యవతి రాథోడ్‌ను ఆర్ అండ్ సీఈ రూరల్ డెవలప్మెంట్ జే మోహన్ నాయక్ ఆధ్వర్యంలో మంత్రి ని సన్మానించారు. రాష్ట్రంలో గిరిజన ప్రజలకు పోడుపట్టాలు ఇప్పిచ్చిన సత్యవతి రాథోడ్,. కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలకు సహాయం చేయాలని కోరారు. ఎంపీపీ ప్రేమ్ నాయక్, బంజారా జిల్లా నాయకులు రామావత్ మోహన్ నాయక్, బాదావత్ శంకర్ నాయక్, బానోత్ గోపాల్ నాయక్ , బానోత్ శ్రీరామ్ నాయక్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మొబైల్ అందజేసిన ఎస్సై

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొబైల్స్ ను పోగొట్టుకున్న వారికి నిజామాబాద్ రూరల్ ఎస్ఐ మహేష్ 9 సెల్ ఫోన్లు బాధితులకు మంగళవారం అందజేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసి వాటిని బాధితులకు రూరల్ సీఐ వెంకట నారాయణ, ఎస్ఐ మహేష్ అందజేశారు. ఎస్ఐని, పీసీలను సీఐ అభినందించారు.

సీఈని కలిసిన రూరల్ మండల నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్

నిజామాబాద్ రూరల్ మండలంలో కొత్త రోడ్లను మంజూరు చేయించాలని కొత్తగా నియమితులైన రాష్ట్ర ఆర్ అండ్ రూరల్ రోడ్స్ సీఈ మోహన్ నాయక్‌ను మండల నాయకులు కోరారు. ఆయన్ను కలిసిన వారిలో అనుష ప్రేమ నాయక్, గోపాల్ నాయక్, మావత్ మోహన్ నాయక్, శంకర్ నాయక్, శ్రీరామ్ నాయక్, బంజారా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ఎస్సై తిరుపతిని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ విమెన్ రైట్స్ కౌన్సిల్ వారు శాలువాతో ఘనంగా సన్మానించారు. మండలకమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ఇంచార్జి సుర్భీర్యాల ప్రసాద్, నిజామాబాద్ రూరల్ చైర్మన్ బట్టి దత్తాద్రి గౌడ్, మండల చైర్మన్ రాకేష్, ఎడ్యుకేషన్ మండల చైర్మెన్ కొప్పు రాజేందర్, మహేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



దేవాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని పలు గ్రామాల దేవాలయాలకు కోటి 5 లక్షల రూపాయలు మంజూరు చేయించిన టిఎస్ఆర్టిసి చైర్మన్, శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ కి కొండాపూర్,తుంపల్లి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. దేవదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, టిఎస్ఆర్టిసి చైర్మన్, శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్ సహకారంతో కొండాపూర్ హనుమాన్ మందిరానికి 35 లక్షలు, తూంపల్లి హనుమాన్ మందిరానికి 35 లక్షలు, తూంపల్లి మల్లయ్య మందిరానికి 35 లక్షలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో కొండాపూర్ సర్పంచ్ రమేష్, సొసైటీ వైస్ చైర్మన్ అబ్బాస్, తుంపల్లి సర్పంచ్ బాలమణి మల్లేష్,దేవాలయం చైర్మన్ నర్సయ్య, ఎక్స్ ఎంపిటిసి చందర్, తదితరులు పాల్గొన్నారు.

గోన్‌గొప్పులలో పశువులకు టీకాలు

నవతెలంగాణ-భీంగల్

మండంలంలోని గోన్‌గొప్పుల గ్రామంలో పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు టీకాలను వేశారు. 54 గోజాతి పశువులకు, 163 గేదెజాతి పశువులకు సర్పంచ్ వ్యాక్సిన్‌ను అందజేశారు. 1938 గొర్రెలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలను వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అనసూయ, పశు వైద్యాదికారి కృష్ణ, కురుమ సంఘం మండల అధ్యక్షుడు కొమ్ము నరేష్, సిబ్బంది సంతోష్, సుమన్, గోపాలమిత్ర రమేష్ తదితరులు ఉన్నారు.

మద్దూర్ సిడిపిఓపై చర్య తీసుకోవాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నారాయణపేట జిల్లా మద్దూర్ ప్రాజెక్టు ఐసిడిఎస్, సిడిపిఓ పై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.యాది రెడ్డి, ఐసిడిఎస్ జిల్లా పిడికి వినతి పత్రాలు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.స్వర్ణ, జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ.రమేష్ బాబు, మాట్లాడుతూ 3,4 నెలల నుండి మద్దూర్ ప్రాజెక్టులో టీచర్లపై వేధింపులను నిరసిస్తూ ఆందోళనలు చేస్తున్నారన్నారు. సిడిపిఓ అక్కడి అంగన్వాడీ టీచర్లను హెల్పర్లను తీవ్రంగా వేధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే వందమందికి పైగా మెమోలు ఇచ్చి ముగ్గురు టీచర్లను, ఒక హెల్పర్‌ను టర్మినేట్ చేశారని తెలిపారు. 25ఏండ్లుగా విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో అవమానకరంగా మాట్లాడుతూ దుర్భాషలాడుతు న్నారని, వేధింపులను భరించలేక ఉద్యోగంవదిలి పోవడానికి, చనిపోవడానికి సిద్ధపడుతున్నారని అన్నారు. వారికి యూనియన్ ధైర్యం చెప్పడంతో మనో నిబ్బరంగా ఉన్నారని, ఫలితంగా గత కొంతకాలం నుండి రిలే దీక్షలు చేస్తున్నప్పటికీ ఎటువంటి చర్యలు ఆమెపై తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా మద్దూర్ సిడిపిఓపై చర్యలు తీసుకొని, టెర్మినేట్ చేసిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. మెమోలను వెనక్కి తీసుకోవాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు వి.సునీత, సరిత, భూమవ్వ, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజలను అయోమయానికి గురి చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

- బీజేపీ మండల అధ్యక్షుడు కట్ట సంజీవ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి స్పెషల్ అసిస్టెన్స్ ఫండ్ కోటాలో మంజూరు చేసిన నిధుల విషయంలో వీఆర్ఎస్ నాయకులు అవగాహన రాహిత్యంతో ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని బీజేపీ కమ్మర్ పల్లి మండల అధ్యక్షుడు కట్ట సంజీవ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి స్పెషల్ అసిస్టెన్స్ ఫండ్ కోటాలోరూ.5221 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ విషయంపై ఎంపీ అరవింద్ పూర్తి ఆధారాలతో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం జరిగిందన్నారు. ఈ నిధులు లోన్ రూపంలో అన్ని రాష్ట్రాలకు ఇచ్చారని బీఆర్ఎస్ నాయకులు అవగాహన రాహిత్యంతో ప్రజలను అయోమయానికి గురి చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన స్పెషల్ అసిస్టెన్స్ ఫండ్ జీరో శాతం వడ్డీతో 50 సంవత్సరాల అగ్రిమెంట్ తో విడుదల చేశారన్నారు. ఈ నిధుల అవకతవకల పైనా అదేవిధంగా డబుల్ బిల్లింగ్ ల పైన విచారణ జరిపించాలని రెండు రోజుల క్రితమే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ కు ఎంపీ అరవింద్ ఫిర్యాదు కూడా చేశారని తెలిపారు. సమావేశంలో నాయకులు కుంట భూమా రెడ్డి,నుకాల మల్లేష్ యాదవ్, సంత లింగారెడ్డి, కొత్తపల్లి అరుణ్, చింత ప్రవీణ్, చింత హన్మంత్, చిట్యాల దేవేందర్, కొత్వాల్ క్రాంతి, సక్కారం నర్సారెడ్డి పాల్గొన్నారు.

అంగన్వాడీలో సామూహిక సీమంతం



సీమంతంలో పాల్గొన్న గర్భిణులు

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని నాగేంద్రనగర్ గ్రామంలోని అంగన్వాడీ పాఠశాలలో సర్పంచ్ మంజుల బాలాజీ గౌడ్, అంగన్వాడీ టీచర్ అనురాధ గర్భిణులకు గాజులు, పసుపు కుంకుమ, తదితరాలు అందించి సామూహిక సీమంతం జరిపారు. కార్యక్రమంలో ఆశవర్కర్ సరస్వతి,గ్రామంలోని గర్భిణులు,మహిళలు పాల్గొన్నారు

రూ.2.50 లక్షల ఎల్ఓసి అందజేసిన మంత్రి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన కే. అనసూయ వెన్నుముక సంబంధిత సమస్యతో బాధపడుతోంది. ఈ విషయం ప్రజాప్రతినిధులు మంత్రి ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యంకోసం ప్రభుత్వం నుండి రూ. 2లక్షల 50వేల ఎల్ఓసిని మంజూరు చేయించారు. ఎల్ఓసి కాపీని మంగళవారం కుటుంబ సభ్యులకు మంత్రి హైదరాబాద్‌లో అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెండే ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



ఎల్ఓసీ అందజేస్తున్న మంత్రి

కేసీఆర్, బాజిరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-మోపాల్

మండల కేంద్రంలో గల న్యాల్కల్ డిపో కార్యాలయంలో జెడ్పిటిసి కమల నరేష్, సిర్పూర్ సర్పంచ్ ముత్యంరెడ్డి కేసీఆర్, బాజిరెడ్డి గోవర్ధన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్ర చరిత్రలో ఇది చిరస్మరణీయమైన ఘట్టమని, దాదాపు. 45 వేల మంది కార్మికుల కుటుంబాల జీవితంలో వెలుగు నింపిన రోజు అన్నారు. కేవలం కేసీఆర్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం శుభసూచకమని తెలిపారు. ఆర్టీసీ నష్టాల్లో ఉంటుందని ప్రవేట్ పరం చేయాలని చూసే వారికి ఇది చెంపపెట్టు లాగా ఉందని అన్నారు. బాజిరెడ్డి గోవర్ధన్ ఆర్టీసీ చైర్మన్‌గా ఉన్నప్పుడు ప్రభుత్వంలో విలీనం చేయడం గర్వకారణమని కొనియాడారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సీ సెల్ కన్వీనర్ భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

నారాయణ జూనియర్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నారాయణ జూనియర్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక(టివియువి), ఎఐ.యస్.బి ఆధ్వర్యంలో డిఐఈఓ రఘురాజ్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టి.వియు.వి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్ సింగ్ ఎ.ఐ.స్.బి రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్ రెడ్డి మాట్లాడుతూ సెలవుల్లో సైతం తరగతులు నిర్వహించారని అన్నారు. సెలవుల్లో వర్షం లో సైతం విద్యార్థులను కళాశాల కు రావాలని వేధించారని అందుకు ఆ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఈవీఎం, వీవీప్యాట్లపై అవగాహన

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని సిర్పూర్ గ్రామంలో మంగళవారం తహసిల్దార్ లత ఆధ్వర్యంలో మంగళవారం గ్రామస్తులకు ఈవీఎం, వీవీప్యాట్లపై అవగాహన కల్పించారు. ఏ విధంగా ఓటు వేయాలో ప్రత్యక్షంగా చూపించారు. ఈసందర్భంగా తహసీల్దార్ లత మాట్లాడుతూ 18 సంవత్సరాల నుండి ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ మునీరుద్దీన్, జడ్పిటిసి కమలా నరేష్ ఎంపీపీ లతా కన్నీరం, సర్పంచ్ ముత్యంరెడ్డి, ఎంపీటీసీ రఘు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నష్టపోయిన రైతాంగాన్ని తక్షణమే ఆదుకోవాలి

- టీపిసిసి అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

జిల్లాలో వరుసగా కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతాంగని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని టిపిసిసి అధికార ప్రతినిధి బాస వేణుగోపాల్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని ఉప్లూర్ గ్రామంలో వరద తాకిడికి పంట పూర్తిగా కొట్టుకుపోయిన, ఇసుక మేటలు వేసిన వరి పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సహాయం కింద రైతులకు ఎకరానికి రూ. 20వేల నష్టపరిహారం అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహారాష్ట్రలో పార్టీని విస్తరించడానికి సమయాన్ని కేటాయిస్తున్న కేసీఆర్‌కు పంటలు నష్టపోయిన రైతులు కనిపించడం లేదని విమర్శించారు. క్యాబినెట్ సమావేశంలో వర్షాలకు ధ్వంసమైన రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించి పొలాలు నష్టపోయిన రైతులకు మాత్రం నిధులు కేటాయించకపోవడం సిగ్గుచేటు అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కొమ్ముల రవీందర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి తక్కురి దేవేందర్, సీనియర్ నాయకులు బద్దం రాజేశ్వర్ రెడ్డి, బద్దం నాగేష్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోనగిరి భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

క్రీడా పరికరాలు పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

సాఫ్ట్‌బాల్ ఇండియా క్రీడాకారిణి గుగులోత్ మమతకు మంగళవారం హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో క్రీడా పరికరాలు పంపిణీ చేశారు. ధర్పల్లి మండలం ధనం బండ తాండ గ్రామానికి చెందిన సాఫ్ట్ బాల్ ఇండియా క్రీడాకారిణి గూగులోత్ మమత కు వసంత టూల్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత విద్యాదాత, క్రీడాదాత ఏనుగు దయానంద్ రెడ్డి సాఫ్ట్ బాల్ క్రీడ క్యాచర్ పరికరాలను అందజేశారు. సాఫ్ట్ బాల్ క్రీడలో రాష్ట్రంలోనే నిజామాబాద్ జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలిచేలా కృషి చేస్తున్నందుకు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి ప్రభాకర్ రెడ్డి ,,ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్‌ను అభినందించారు. కార్యక్రమంలో చిట్టాపూర్ మాజీ సర్పంచ్ న్యావనంది గణేష్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి బి మల్లేష్ గౌడ్, ఉపాధ్యక్షులు జైడి రాజ్ కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కేజీ టు పీజీ ఉచిత విద్య

- యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు విక్కీ యాదవ్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే యువతులకు స్కూటీ, యువతీ యువకులకు కేజీ టు పీజీ ఉచిత విద్య అందించడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు విక్కీ యాదవ్ తెలిపారు. మంగళవారం మండల అధ్యక్షులు సొప్పారి వినోద్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన యువజన కాంగ్రెస్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత విద్యుత్తుతో పాటు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు ఉమ్మాజి నరేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జెడి చిన్నారెడ్డి, యువజన విభాగం మండల అధ్యక్షులు సొప్పరి వినోద్. రూరల్ ఎస్టీ సెల్ యూత్ అధ్యక్షులు పీర్ సింగ్, మండల ప్రధాన కార్యదర్శి వసంతరావు, జిల్లా జనరల్ సెక్రెటరీ లక్ష్మణ్, మైనార్టీ సెల్ అధ్యక్షులు సైకిల్ అక్బర్, రైమత్ అలీ, మండల్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేశ్ పల్లి ప్రణయ్, అజ్మీర రాజేష్. మైనారిటీ యూత్ అధ్యక్షులు నియమత్ అలి, యూత్ అధ్యక్షుడు షాదుల్లా రాజేష్ పాల్గొన్నారు.

మతతత్వ పార్టీకి ఓటు వేయొద్దు : సీపీఐ

నవతెలంగాణ-ఆర్మూర్

రానున్న ఎన్నికల్లో మతతత్వ పార్టీ బీజేపీకి ప్రజలు ఓటు వేయొద్దని భారత కమ్యూనిస్ట్ పార్టీ సీపీఐ డివిజన్ కార్యదర్శి అరేపల్లి సాయిలు అన్నారు. మంగళవారం పట్టణంలోని బస్టాండ్ వద్ద కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మతపరమైన రాజకీయాలకు బీజేపీ అనుబంధ సంఘాలు ఆర్ఎస్ఎస్ విశ్వహిందూ పరిషత్, జజరంగ్‌దల్ దేశాన్ని విచ్ఛిన్నం చేసే ఆలోచనలో అనేక చోట్ల అల్లర్లు సృష్టిస్తున్నారని తెలిపారు. మణిపూర్ ఘటనే దీనికి నిదర్శనమని అన్నారు. నరేంద్ర మోడీ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చ లేదని, వంట గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే ప్రధాని టీవీల ముందుకు వచ్చి పనికి మాలిన ఉపన్యాసాలు ఇస్తున్నారనిఎద్దేవాచేశారు. కార్యక్రమంలో మాదిరే లక్ష్మణ్ కుమార్, మౌలానా, పెరొజ్, వినయ్, నగేష్, జావేద్, శ్రీకాంత్, షేక్ ఇమాం, రహీమ్, జేమున.తదితరులు పాల్గొన్నారు.

నీతా డిసౌజా, సునీతరావులను కలిసిన సంజయ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగర తొలి మేయర్, కాంగ్రెస్ సీనియర్ నేత ధర్మపురి సంజయ్ మంగళవారం ఆల్ ఇండియా మహిళ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు నీతా డిసౌజా, తెలంగాణ రాష్ట్ర మహిళ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత రావు లను హైదరాబాద్ లో మర్యాద పూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేలా, తీసుకోవాల్సిన చర్యలపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా నీతా డిసౌజా మాట్లాడుతూ.. మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ప్రవేశ పెట్టిన వివిధ రకాల పథకాలను జనాల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.500కే గ్యాస్ సిలిండర్, ఉచిత బస్సు ప్రయాణం, యువతులకు స్కూటీ పంపిణీ, వితంతు, ఒంటరి, వృద్ధ మహిళలకు, బీడీ కార్మికులకు రూ. 4వేల పెన్షన్ అందిస్తుందనే హామీలను గడప గడపకు తీసుకెళ్లాలని సూచించారు. మహిళలను కాంగ్రెస్ పార్టీకి చేరువ చేయాలని దిశానిర్దేశం చేశారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్/మోపాల్/జక్రాన్‌పల్లి

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావును రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ప్రగతి భవన్‌లో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ తరపున ఉద్యోగుల తరపున సీఎం కేసీఆర్ కు పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలియజేశారు.



కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని మిర్ధపల్లిలో కల్యాణ లక్ష్మి చెక్కును సర్పంచ్ మధు వర్మ ఇట్టేడి భూదేవి నర్సారెడ్డి కి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నూత్పల్లి భూమన్న, నర్సింహారెడ్డి, గంగారెడ్డి, ఏలేటి భోజన్న, సురేష్, సంతోష్, ముకేశ్, లింగారెడ్డి, గంగాధర్, అశోక్, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న నాయకులు

టీడీపీ చేసిన అభివృద్ధే కనిపిస్తోంది

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలుగుదేశం పార్టీ చేసిన అభివృద్ధి కనిపిస్తుంది తప్ప తెలంగాణలో ఏ అభివృద్ధి జరగలేదని టిడిపి నిజామాబాద్ అర్బన్ ఇంఛార్జి వినోద్ కుమార్ అన్నారు. నిజామాబాద్ నగరంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం మంగళవారం నిజామాబాద్ అర్బన్ ఇంచార్జ్ వినోద్ కుమార్ 15, 16 వ డివిజన్‌లతో నిర్వహించారు. రెండు రూపాయల కిలో బియ్యం తెలుగుదేశం పార్టీ ఇచ్చిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో కల్లేడ గంగాధర్,మైనారిటీ అధ్యక్షులు అహ్మద్, శంకర్ ముదిరాజ్, అర్సపల్లి అశోక్, నవటే నర్సయ్యకలిమ్, ఇమ్రాన్ చహుష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధానంద్ గంజ్‌లో అన్నదానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో స్థానిక శ్రద్ధానంద్ గంజ్‌లో హమాలి సభ్యులందరికీ అన్నదానం మంగళవారం ఏర్పాటు చేసినట్టు క్లబ్ అధ్యక్షులు జి రామకృష్ణ తెలిపారు. దాతగా రోటరీ సభ్యులు ఆకుల సందీప్ ముందుకు వచ్చారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ప్రధాన కార్యదర్శి ఎన్ ప్రసన్నకుమారి, ట్రైనర్ ఆకుల అశోక్, సర్వీస్ డైరెక్టర్ బాబురావు, మాజీ అధ్యక్షులు శ్రీరాంసోని, జ్ఞానప్రకాష్, రాజేశ్వర్, రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వంలో విలీనం పట్ల ఆర్టీసీ కార్మికుల హర్షం



నవతెలంగాణ-బోధన్‌టౌన్

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి 43వేలపైన ఉన్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినందుకు బోధన్ పట్టణంలోని ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి, ఆర్టీసీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర దేశాయ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, బీఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు రవిశంకర్ గౌడ్, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

ఐదు మొక్కలు నాటాలి



నవతెలంగాణ-ఎడపల్లి

ఆరో విడత హరితహారంలో భాగంగా వర్షాకాలంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినందున ప్రతి ఒక్కరూ తమ వంతుగా ఐదు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలను తీసుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శి రామిరెడ్డి అన్నారు. మండలంలోని మంగల్‌పహాడ్ గ్రామపంచాయతీ ఆవరణలో పూల మొక్కలను నాటారు. వర్షాలు సమృద్ధిగా కురవాలంటే మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు చేపడితే అవి పెరిగి పెద్దగా మానవ మనుగడకు ఎంతో దోహదపడతాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మనోహర్, వెంకట రమణ, ఉపాధి కూలీలున్నారు.

చిన్నారులకు తల్లిపాలే శ్రేయస్కరం

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోపి లక్ష్మి
- పలు చోట్ల తల్లిపాలపై అవగాహన

నవతెలంగాణ-విలేకరుల బృందం

బోధన్ : పుట్టిన చిన్నారులకు తల్లిపాలు అందించడం మంచిదని ప్రతి చిన్నారికి తల్లిపాలు అమృతం లాంటిదని, అది ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోపి లక్ష్మి అన్నారు. మంగళవారం ఊట్‌పల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అంగన్వాడీ కార్యకర్తలు తల్లిపాలు, ముర్రుపాల ఆవశ్యకతపై బాలింతలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ప్రతి గర్భిణీ స్త్రీకి బాలింతలకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈ తల్లిపాల వారోత్సవాలు ఈ నెల 8వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని కావున ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధిక, ఆసియా, గంగావేణి, అంగన్వాడీ టీచర్లు విక్టోరియా రాణి, మేరీ, జయసుధ గిరిజా తదితరులు పాల్గొన్నారు.

బోధన్ టౌన్ : తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రసవించిన ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా బోధన్ జిల్లా ఆస్పత్రిలో ప్రసంగించిన తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ వారోత్సవాలను ఈనెల 8వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్స్ రాధిక, ప్రమీల, మమత, ఆసియా, గంగావేణి తదితరులు పాల్గొన్నారు.



బోధన్ : బోధన్ ప్రభుత్వాస్పత్రిలో బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

ఎడపల్లి : తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐసీడీఎస్ మండల పర్యవేక్షకురాలు వినోద మాట్లాడారు. ముర్రుపాల ప్రాముఖ్యతను వివరించారు. తల్లిపాలలో ఎన్నో పోషక గుణాలున్నాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో సరైన అవగాహన లేక వీటిని పిల్లలకు పట్టించడం లేదని అన్నారు. లేనిపోని అపోహలు పెట్టుకొని పోషక విలువలు ఉన్న తల్లిపాలను దూరం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు విశాల్‌రెడ్డి, రాజ్‌కుమార్, వెంకటేష్, ఆస్పత్రి పాలనాధికారి రాములు, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు కృష్ణ తులసి, విజయలక్ష్మి, గంగామణి, వీణ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జుక్కల్ : మండలంలోని పెద్ద ఎడ్గి సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలలో టీచర్లు ప్రేమల, యమున, పుష్ప తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ అస్పత్‌వార్ వినోద్, ఎంపీటీసీ సునీతా పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలింతలకు, గర్భిణులకు తల్లిపాల గురించి టీచర్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్, టీచర్ ప్రేమల మాట్లాడుతూ.. తల్లి పాలు ఎంతో శ్రేష్టమైనవని, పుట్టగానే శిశువుకు పసుపు పచ్చటి ముర్రుపాలు పట్టించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకుడు విజయ్ పటేల్, ఆరోగ్య సూపర్‌వైజర్, ఆశాలు, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

జల్లపల్లిలో తల్లిపాల వారోత్సవాలు..

కోటగిరి : కోటగిరి ఉమ్మడి మండలంలోని జల్లపల్లి గ్రామంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తల్లిపాల గొప్పతనం ప్రాముఖ్యతను జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ విద్య తెలియపరిచారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్లు మనీ, సుమలత, ఆసుపత్రి సూపర్వైజర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.



కోటగిరి : తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి

పంటలను పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి



పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని చిన్నతడ్గూర్ గ్రామ శివారు ప్రాంతాన్ని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి మంగళవారం సందర్శించారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగులైన తెల్ల దోమ, పచ్చదోమ, తామర పురుగు గమనించారు. దీని నివారణకు అసెటమిప్రిడ్ 50గ్రాములు ఎకరాకు లేదా తయమే తక్సమ్ 50గ్రాములు ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు. అదేవిధంగా సోయాబీన్ పంటలో యెల్లో మోసైక్ వైరస్ వై ఎన్వీ గమనించి నివారణకు ఫ్లోనాకామిడ్ రెండు ఎంఎల్ నీటికి లేదా అసటాపి ప్రైడ్ 50 గ్రాములు ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు. ఫాస్పరస్ సోలుబిలైజింగ్ పీఎస్‌బీ వాడకం గురించి రైతులకు వివరించారు. పీఎస్‌బీ భూమిలో వున్న కరగని భాస్వరంను కరిగే విధంగా మార్చి మొక్కకు అందిస్తుందని, దీని వలన ఫాస్పరస్ ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చని వివరించారు. అదేవిధంగా కలుపు మందుల వాడకం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో డీఏవో భాగ్యలక్ష్మి, సతీష్ చిద్రావర్, రైతు బంధు సమితి గ్రామ అధ్యక్షులు శంకర్ పటేల్, రైతులు నగుల్గావే పాండురంగ పటేల్, ఇసంవర్ శివాజీ, దిగంబర్, లుటే దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సీఏకు సన్మానం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బాగేపల్లి సీఏ హిందూను ఘనంగా సన్మానించినట్లు ఏపీఎం చిన్నయ్య, సీసీ శివ కుమార్ పేర్కొన్నారు. బ్యాంకు లింకేజీ లోన్స్ ఇప్పించుటలో మండల స్థాయిలో ముందంజలో ఉండడమే కాకుండా, సంవత్సర టార్గెట్‌ను నాలుగు నెలలలోపే పూర్తి చేసినందున, ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌లలో డేటా నమోదు చేయడంలో కూడా బాగేపల్లి గ్రామాన్ని ముందంజలో ఉంచిన సీఏ హిందును ఏపీఎం చిన్నయ్య, సీసీలు శివకుమార్, భాస్కర్, రాజయ్య, సీఏలు పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోవాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండల కేంద్రంలో రిలే నిరాహారదీక్ష చేస్తున్న ఎంపీటీసీ ఉమాదేవి గురు ప్రతాప్ అసత్య ఆరోపణలు మానుకోవాలని అన్నాసాగర్ సర్పంచ్ నాగరాజు అన్నారు. ఎల్లారెడ్డి మార్కెట్ కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఎల్లారెడ్డి మండల కేంద్రంలో గత మూడు రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న అన్నాసాగర్ ఎంపీటీసీ జంగిటి ఉమాదేవి గురుప్రతాప్ ఎమ్మెల్యేపై, బీఆర్ఎస్‌పై నిరాధరమైన ఆరోపణలు చేయడంతో పాటు, గ్రామ అభివృద్ధి జరగలేదనడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో తిమ్మారెడ్డి సర్పంచ్ అబ్దుల్ అలీ పాషా, అజమాబాద్ సర్పంచ్ గొట్టాల సాయిలు, అన్నసాగర్ రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

పంటలపై సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- మండల వ్యవసాయ అధికారి నరేష్

నవతెలంగాణ-గాంధారి

పంటలపై సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి నరేష్ అన్నారు. మంగళవారం మండలంలోని నాగ్లూర్ గ్రామంలో సోయా, వరి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరుసగా కురిసిన వర్షాలకు పంటలు కొద్దిగా ఎరుపుగా మారి పంట ఎదుగుదల మందగించిందని తెలిపారు. దీని నుంచి పంటలను కాపాడుకోవడానికి పిచికారీ చేయాల్సిన మందులను వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ ఆరతి, రైతులు పాల్గొన్నారు.

రిలే నిరాహారదీక్ష మాజీ జడ్పీటీసీ మద్దతు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు తల్లి తెలంగాణ ప్రాంగణంలో రిలే నిరాహారదీక్ష చేస్తున్న ఎంపీటీసీ ఉమాదేవి గురుప్రతాప్‌కు మద్దతుగా మాజీ జడ్పీటీసీ చినాబాలి సమేల్ మంగళవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంపీటీసీ చేస్తున్న డిమాండ్లను ఎమ్మెల్యే చొరవ తీసుకొని వెంటనే డిమాండ్లను నెరవేర్చాలని అన్నారు. దీక్షలో వెంకటాపూర్ మల్లేష్, లేకవత్ అలీ, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం



ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-భిక్కనూర్

మండల ఎస్సైగా విధులు నిర్వహించి బదిలీపై మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండలానికి వెళ్తున్న ఎస్సై ఆనంద్ గౌడ్‌ను కాంగ్రెస్ నాయకులు పోలీస్ స్టేషన్ ఆవరణలో శాలువాతో మంగళవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు భీమ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, పట్టణ అధ్యక్షులు దయాకర్‌రెడ్డి, నాయకులు సిద్దాగౌడ్, అంకం రాజు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి ఎస్ఐ విరాళం..

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి మండలంలో ఎస్సైగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఆనంద్‌గౌడ్ రూ.10,116 విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ సిద్ధ రాములు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వామి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షులు సాయిరెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ నర్సారెడ్డి, నాయకులు అంజాగౌడ్, ప్రభాకర్, నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ బ్యాంక్ మేనేజర్‌కు సన్మానం

నవతెలంగాణ-వర్ని(చందూర్)

మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం బ్యాంక్ మేనేజర్ మూడ్ గంగాదేవిని చందూర్ పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లు ఆమెను శాలువాతో సన్మానించారు. బదిలీలో భాగంగా వెళుతున్న మేనేజర్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం ఆమె బ్యాంక్‌కు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. బ్యాంక్ అభివృద్ధికి ఆమె సేవలు అభినందనీయమైనవని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లు, కార్యదర్శి వై.భూమయ్య తదితరులున్నారు.

27వ రోజుకు జీపీ కార్మికుల సమ్మె

- వివిధ రూపాల్లో నిరసన

నవతెలంగాణ-విలేకరుల బృందం

జీపీ కార్మికుల సమ్మెకు సర్పంచుల మద్దతు..

జుక్కల్ : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు చేపట్టిన సమ్మెకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు మద్దతు తెలిపారు. కార్మికులను ఆర్థికంగా ఆదుకునేందుకు పలు జీపీల సర్పంచులు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా వజ్రఖండి సర్పంచ్ సంజీవ్ పాటీల్ రూ.5వేలు అందజేశారు. డోన్గాం సర్పంచ్ గజిరే కళావతి తమవంతుగా రూ.3వేలు అందించారు. పెద్దగుల్లా సర్పంచ్ రుక్మినిబాయి విఠల్ పటేల్ రూ.2వేలు అందజేశారు. న్యాయమైన డిమాండ్ల కోరకు జీపీ కార్మికులు చేస్తున్న సమ్మెకు తమవంతుగా ఎప్పుడు ముందుకు వచ్చి సహాయం చేస్తామని, సంపూర్ణ మద్దతు ఉంటుందని వజ్రఖండి, డోన్గాం, పెద్దగుల్లా గ్రామపంచాయతీల సర్పంచులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు గజిరే రాజు, విఠల్ పటేల్, జీపీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



ఎడపల్లి : నోట్లో వేపాకులతో నిరసన తెలుపుతున్న కార్మికులు

నోట్లో వేపాకులు పెట్టుకొని నిరసన..

ఎడపల్లి : మండల కేంద్రంలో సమ్మె కొనసాగుతోంది. సమ్మె మంగళవారానికి 27వ రోజుకు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల గురించి ఎన్ని ఆశలతో మంత్రి క్యాబినెట్ సమావేశంలో చర్చిస్తారని అనుకున్నామని, కానీ గ్రామపంచాయతీ కార్మికుల సమస్య మాట్లాడలేదని తెలిపారు. ఇందుకు నిరసనగా కార్మికులు నోటిలో వేపాకులు పెట్టుకొని నిరసన చేపట్టారు. ప్రభుత్వం ఇకనైనా గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు అతి త్వరలో పరిష్కరించాలని, గ్రామపంచాయతీ కార్మికులు ఇచ్చిన 17 డిమాండ్లను వెంటనే పరిష్కారం చేసి అసెంబ్లీ సమావేశాల్లోపే పంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తున్నామని చెప్పి ప్రభుత్వం జీవో విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ఉమ్మడి జిల్లా జేఏసీ జిల్లా చైర్మన్ జంగం గంగాధర్, జేఏసీ మండల కో కన్వీనర్ గంగరాజు, కుంట సంతు, కారోబార్ల సంఘం మండలాధ్యక్షులు రాజు, పండరి రహీమా తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె కొనసాగుతోంది. సీఎం కేసీఆర్ పారిశుధ్య కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహించడం తగదని, వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికుల మండల అధ్యక్షులు ఫస్టియోద్దీన్, ప్రధాన కార్యదర్శి బి.సాయిలు, సిబ్బంది లాలు, శంకర్, యాదగిరి, గంగామణి, నక్క అనిత, చిన్న సాయిలు, సతీష్, లయక్, తదితరులు పాల్గొన్నారు.

వర్నిలో పంచాయతీ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన..

వర్ని : వర్ని మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నేసాబ్ మాట్లాడుతూ.. కేబినెట్ సమావేశంలో పంచాయతీ కార్మికుల ప్రస్తావన రాష్ట్ర ప్రభుత్వం చెప్పలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్మికులు వర్షంలో సైతం నిరసన చేసే పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిందంటే కేసీఆర్ ప్రభుత్వానికి సిగ్గుచేటని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పంచాయతీ కార్మికుల డిమాండ్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు మద్దతు తెలిపిన బీఎస్పీ నాయకులు..

ఎల్లారెడ్డి : పట్టణ కేంద్రంలో గత కొన్ని రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతుగా బీఎస్పీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు తమ మద్దతు ఉంటుందని వారు చేస్తున్న డిమాండ్లు న్యాయపరమైనవి అని ప్రభుత్వం వెంటనే స్పందించి వారి డిమాండ్లను నెరవేర్చాలని అన్నారు. ఈ దీక్షలో మార్లు సాయిబాబ, సుధాకర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల సమ్మె నిరవధికంగా కొనసాగుతుంది. సమ్మెను ఉద్దేశించి మండలాధ్యక్షురాలు రాజేశ్వరి మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూడటం తగదని, కార్మికుల న్యాయపరమైన డిమాండ్లు నెరవేర్చాలని పేర్కొన్నారు.



వర్ని : అర్ధనగ్న ప్రదర్శనతో నినాదాలు చేస్తున్న కార్మికులు

ఘనంగా మదన్‌మోహన్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

టీపీసీసీ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్ పుట్టినరోజు వేడుకలను పలు గ్రామాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు.

గాంధారి : కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు మండల కేంద్రంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టి సంబరాలు నిర్వమించారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమేష్ పటేల్, ఉమ్మాజీ భాస్కర్ రావు, పరమేష్, రవి, సర్దార్, కృష్ణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



గాంధారి : కేక్ కట్ చేస్తున్న నాయకులు



ఎల్లారెడ్డి : బర్త్‌డే వేడుకల్లో మదన్‌మోహన్

బియ్యం పంపిణీ..

టీపీసీసీ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్‌రావు పుట్టినరోజును పురస్కరించుకుని మండలంలోని గండివేట్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరుపేదలకు మూడు క్వింటాళ్ల బియ్యాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పాలకుర్తి బిందాస్, యూత్ అధ్యక్షుడు సాయిరాం, మదన్‌మోహన్ ప్రధాన అనుచరుడు సర్దార్ సింగ్, గండివేట్ తండా పార్టీ అధ్యక్షుడు విస్లావత్ బాన్సిలాల్, యూత్ ఉపాధ్యక్షుడు సుబ్బారావు, క్రాంతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: టీపీసీసీ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్ జన్మదిన వేడుకలు ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మదన్ మోహన్ జన్మదిన సందర్భంగా మదన్ మోహన్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో 200 మంది రక్తదానం నిర్వహించారు. అనంతరం అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. అదేవిధంగా ర్యాలీగా వెళ్లి సాయిబాబా గుడిలో పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకల్లో వేల సంఖ్యలో మదన్ మోహన్ అభిమానులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ..

లింగంపేట్ : పీసీసీ ఉపాధ్యక్షులు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఐటీ సెల్ చైర్మన్ మదన్ మోహన్ జన్మదిన సందర్భంగా మంగళవారం లింగంపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద కార్యకర్తలు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపించేశారు.

అనంతరం స్థానిక ప్రభుత్వాసుపత్రికి వెళ్లి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కరోనా కష్టకాలంలో ఆయన చేసిన సేవలను రోగులకు వివరించారు. ఉన్నత స్థాయికి ఎదగాలని ఉన్నత పదవులు చేపట్టాలని కార్యకర్తలు కోరారు. లింగంపేట్ టౌన్ యూత్ అధ్యక్షులు ఇర్ఫాన్, సోషల్ మీడియా జిల్లా ఇంచార్జి సాజిత్ సమక్షంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రఫియోద్దీన్, ఎల్లశం ప్రసాద్, రాజు, సూపల నగేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణా టీకాలు తప్పనిసరి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మండలంలోని అన్నసాగర్, అంకుల్‌పేట్ గ్రామాలలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలను పశువైద్య అధికారులు మంగళవారం టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పశువులకు గాలికుంటు టీకా తప్పనిసరిగా వేయాలని అన్నారు. 196 ఆవులకు, 507 గేదెలకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ఆంజనేయులు, శ్రీనివాసరెడ్డి, రమేష్, మహైబూబ్, సాయిలు, సాయిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్ కిట్లు అందజేత



ఆట వస్తువులను పంపిణీ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ కళాశాల విద్యార్థిని విద్యార్థులకు వాలీబాల్, క్రికెట్ కిట్లు, క్యారం బోర్డు, ఆట వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు అనంతరెడ్డి మాట్లాడుతూ.. దోమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలను గత నెల 24వ తేదీ నాడు మాజీ మంత్రి మహమ్మద్ షబ్బీర్ అలీ సందర్శించినప్పుడు విద్యార్థులకు కావలసిన డ్రింకింగ్ వాటర్ ఫిల్టర్ ఏర్పాటుతో పాటు క్రీడాకారులకు క్రీడా వస్తువులు ఇస్తానని విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం మంగళవారం కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ విద్యార్థుల విద్యార్థుల పట్ల అన్ని రకాలుగా ప్రేమ అనుభూతి, సానుభూతి తగిన అన్ని వసతులు కల్పిస్తానని వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చంద్రయ్య గారి అనంతరెడ్డి, టౌన్ అధ్యక్షుడు సీతారాం మధు, జిల్లా కార్యదర్శి అబ్రబోయిన స్వామి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆశ బోయిన శ్రీనివాస్, సీతారాం ప్రసాద్, టౌన్ యూత్ అధ్యక్షుడు, పూల బోయిన రమేష్, పట్టణ టౌన్ సెక్రెటరీ నాగారపు లింగం, జిల్లా నాయకులు రామస్వామి గౌడ్, మైనార్టీ నాయకుడు ఎస్.కె.మహమ్మద్, అంబర్పేట్ యూత్ అధ్యక్షుడు వినీత్, ప్రభాకర్‌రెడ్డి, నాగారపు రాములు, బద్దం రాజేశ్వర్, గోపాల్‌రెడ్డి, బాలరాజ్, నరేష్, కాంగ్రెస్ నాయకులు, కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థిని విద్యార్థులు, కళాశాల లెక్చరర్ బృందం పాల్గొన్నారు.

సాహితీ రత్న అన్నబావు సాటే సేవలు మరువలేనివి

- జుక్కల్ మాజీ ఎమ్మెల్యే అరుణతార

నవతెలంగాణ-మద్నూర్

సాహితీ రత్న అన్న బావు సాటే సేవలు మరువలేనివని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే అరుణతార అన్నారు. 104వ జయంతి సందర్భంగా జుక్కల్ మాజీ ఎమ్మెల్యే బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణాతార మంగళవారం మద్నూర్ మండల కేంద్రంలో గల అన్న బాహు సాటే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆయన సేవలు మరువలేనివని ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడుచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మద్నూర్ బీజేపీ మండలాధ్యక్షులు బి.హన్మండ్లు, మండల జనరల్ సెక్రెటరీ సీహెచ్ హన్మండ్లు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్ జోషి, తుకారం, జనరల్ సెక్రెటరీ కంచిన్‌వార్ యాదవ్‌రావు, కిసాన్ మోర్చా జిల్లా కోశాధికారి ఆర్.కృష్ణ పటేల్, బీజేవైఎం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్, గడ్డి తుకారం తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాల అమలు కోసం కార్మిక గర్జన

- ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-తాడ్వాయి

కేజీబీవీ నాన్ టీచింగ్ అండ్ వర్కర్స్‌కు కనీస వేతనాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో కార్మిక గర్జన పోస్టర్లను టేక్రియాల్ కేజీబీవీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ.. కేజీబీవీల్లో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ అండ్ వర్కర్స్‌కు ఇప్పటికీ కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. వీరికి పీఎఫ్, ఈఎస్ఐ లాంటి ఆరోగ్య, ఉద్యోగ భద్రత లేదన్నారు. కనీస వేతనాలు అమలు కాక, శ్రమదోపిడికి గురవుతున్నారన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఇచ్చిన జీవో నెం.60 కూడా వీరికి అమలు కావడం లేదన్నారు. పని భారం పెరిగినా ఖాళీలు భర్తీ చేయడం లేదన్నారు. ఇంటర్ కాలేజీలుగా అప్ గ్రేడ్ అయిన కేజీబీవీల్లో పనిభారం మరింత తీవ్రంగా ఉందన్నారు. కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. కేజీబీవీల్లో పనిచేసిన సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగాల్లో సర్వీస్ వెయిటేజీ ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్ల సాధనలో భాగంగా ఆగస్టు 4న హైదరాబాదులో కార్మిక గర్జన నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్లు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది వాణి, శిరీష, శ్యామల, సుకన్య, లలిత, రజిత, శ్రీలత, లక్ష్మి, సంధ్య, లత, మాధవి, నర్సవ్వ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రభుత్వ విద్యాసంస్థల్లో మీడియా విద్యార్థి సంఘాలను అనుమతించరాదు అని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడాన్ని నిరసిస్తూ ప్రభుత్వ దిష్టి బొమ్మను మంగళవారం పట్టణంలో దహనం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోనే ఇలాంటి ప్రజాస్వామ్యం కొనసాగుతుందని తెలంగాణ నవనిర్మాణ విద్యార్థి సేన జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేష్ ఎద్దేవా చేశారు. ప్రభుత్వ లోపాలు తెలుసాయని విద్యాసంస్థలలో మీడియా, విద్యార్థి సంఘాలని రానివ్వొద్దని సర్క్యులర్ జారీ చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు అవమానమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయి కిషోర్, సాయి, వినోద్, అరవింద్, సురేష్, నాయకులు పాల్గొన్నారు.

ఎస్సైకి సన్మానం


ఎస్సైని సన్మానిస్తున్న గ్రామస్తులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గం గ్రామానికి చెందిన పార్థ సాయిరెడ్డి, మేత్రి రాజు, బాబురావు నూతనంగా బాధ్యతలను చేపట్టిన ఎస్సై ఉదయ్ కుమార్‌ను మంగళవారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకతీతంగా నిరుపేదలకు అండగా నిలవాలని వారన్నారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి వారికి న్యాయాన్ని అందించాలని వారు కోరారు.

యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల రెగ్యులరైజేషన్ చేయాలి


నిరసన వ్యక్తంచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

నవతెలంగాణ-భిక్కనూర్

తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణంలో యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆధ్వర్యంలో 12 విశ్వవిద్యాలయాలు పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని, గత అనేక సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్నా, 2014 సంవత్సరం నుంచి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర క్యాబినెట్లో సైతం తమ అంశం చర్చించకపోవడం బాధాకరమని, వెంటనే ప్రభుత్వం సబ్ కమిటీని ఏర్పాటు చేసి తమ సర్వీసులను రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్ ప్రొఫెసర్లు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.నారాయణ గుప్తా, డాక్టర్ యాలాద్రి, నరసయ్య, రమాదేవి, సునీత, శ్రీకాంత్, నిరంజన్ శర్మ, వైశాలి, దిలీప్, సరిత తదితరులు పాల్గొన్నారు.

బోధన్ ఆర్‌డీఓకు సన్మానం


ఆర్డీవోను సన్మానిస్తున్న ప్యారం అశోక్

నవతెలంగాణ-వర్ని

బోధన్ ఆర్డీవోగా నూతన బాధ్యతలు చేపట్టిన రాజాగౌడ్‌ను చందూర్ పీఏసీఎస్ చైర్మన్ ప్యారం అశోక్ శాలువా కప్పి సన్మానించారు. మంగళవారం ఆర్‌డీఓను మర్యాద పూర్వకంగా కలిసిన ఆయన సొసైటీ, సహకార సంఘం బ్యాంకు అభివృద్ధిపై మాట్లాడారు. ఆయనతోపాటు తూర్పు కృష్ణారెడ్డి తదితరులున్నారు.

దండిగుట్టలో తీజ్ వేడుకలు


తీజ్ వేడుకలో గ్రామస్తులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దండిగుట్ట గ్రామంలో గిరిజనులు తీజ్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గత వారం రోజుల కిందట శీతల్ పండుగ వేడుకలను నిర్వహించిన గిరిజనులు మంగళవారం తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సర్పంచ్ ముల్లపూడి శ్రీదేవి కృష్ణారావు పాల్గొని ఆడపడుచులందరికీ కట్నాలను అందజేశారు. మహిళలు సామూహికంగా నృత్యాలను చేస్తూ స్థానిక కళ్యాపూర్ చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆడపడుచులతోపాటు యువకులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన డీసీఎం.. డ్రైవర్‌కు గాయాలు



- ఆసుపత్రికి తరలింపు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దండిగుట్ట సమీపంలో డీసీఎం బ్రేకు లు ఫెయిలవడంతో డీసీఎం అదుపు తప్పి డ్రైవర్ ప్రవీణ్‌కు గాయాలయ్యాయి. ముందటి చక్రాలు పూర్తిగా ధ్వంసం అవడంతో ప్రమాదం చోటుచేసుకుంది. నిజామాబాద్ నుంచి స్థానిక వైన్స్‌లో మద్యాన్ని సరఫరా చేసి, తిరుగు ప్రయాణంలో బ్రేకులు అదుపుతప్పడంతో కల్వర్టుకు ఢీ కొట్టుకొని డీసీఎం నిలిచిపోయింది. ఈ విషయం తెలిసిన వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించగా గాయపడిన డ్రైవర్‌ను నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు.

శిథిలావస్థలో సబ్ స్టేషన్


శిథిలావస్థలో ఉన్న సబ్ స్టేషన్

నవతెలంగాణ-రాజంపేట్

మండలంలోని ఆర్గొండ గ్రామంలో గల సబ్‌స్టేషన్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గత సంవత్సరం క్రితం నుంచి సబ్ స్టేషన్ గోడలు పగుళ్లు రావడంతో ఈ విషయంపై అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. ఎలాంటి స్పందన లేకపోయింది. ఆ సబ్ స్టేషన్‌లోకి నిత్యం విషపూరితమైన పాములు రావడంతో సిబ్బంది తీవ్రమైన ఇబ్బందులు పడవలసి వస్తుంది. తమరికి ఏమైనా అయితే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన భవనం ఏర్పాటు చేయాలని వారు వివరించారు.

మహాసభ వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈ నెల 7న తిరుపతిలో జరిగే అఖిల భారత జాతీయ బీసీ 8వ మహాసభ వాల్‌పోస్టర్లు మంగళవారం నిజామాబాద్ జిల్లా బీసీ సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఎస్వీ యూనివర్సిటీ గ్రౌండ్లో నిర్వహించే సభకు నిజామాబాద్ నుండి పెద్ద ఎత్తున బీసీలు మహాసభకు తరలి రావాలని సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నరాల సుధాకర్ కోరారు. ఈ మహాసభలో బీసీల కులగణన నిర్వహించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ రంగాల్లో బీసీలకు, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు 60శాతం టికెట్లు కేటాయించాలని, బీసీ ముఖ్యమంత్రిని చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 9 స్థానాలకు గాను ఐదు అసెంబ్లీ స్థానాలను బీసీల కేటాయించాలని అన్నారు. పోల్కం గంగాకిషన్, ధర్మనం దేవేందర్, కరిపే రవిందర్, కొయ్యాడ శంకర్, శ్రీలత, సంజీవ్, బాలన్న, తోట మహేష్, శంకర్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటూ నివారణా టీకాలు వేయించాలి

- ఏరియా వెటర్నరీ సహాయ సంచాలకులు ఎం.డి . జియా ఉద్దీన్

నవతెలంగాణ-ఆర్మూర్/సిరికొండ/మోపాల్

పశువుల ఎదుగుదలకు నట్టల నివారణ మందుతో పాటు గాలికుంటూ నివారణా టీకాలు వేయించాలని ఏరియా వెటర్నరీ హాస్పిటల్ సహాయ సంచాలకులు ఎండి జియాఉద్దీన్ తెలిపారు. పట్టణంలోని అర్బన్ ఏరియా వెటర్నరీ హాస్పిటల్ పరిధిలోని గోజాతి, గేదె జాతి పశువులలో నట్టల నివారణ మందులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీటి వల్ల పశువుల్లో ఉన్న నట్టలు పడిపోయి జీర్ణశక్తి పెరుగుతుందని, పశువుల ఎదుగుదల బాగుంటుందని అన్నారు. ఈ నట్టల నివారణ మాత్రలను గాలికుంటు టీకాలు వేయడానికి ముందు ఇవ్వడం జరుగుతుందన్నారు. గాలికుంటు వ్యాధి వలన పశువుల గిట్టలు, నోట్లో పుండ్లు అయి పశువులు బలహీనంగా అవుతాయని తెలిపారు. పాల ఉత్పత్తి తగ్గి రైతులు ఆర్థికంగా నష్ట పోవడం జరుగుతుం దన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ రోజా శ్రీ, పశు వైద్య సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.


ఆర్మూర్ : పశువులకు నట్టల మందు పంపిణీ

సిరికొండ: మండలంలో పశువులకు, గేదెలకు నట్టల నివారణ మందును మంగళవారం పంపిణీ చేశారు. మండల కేంద్రంలో సర్పంచ్ యెన్నం రాజారెడ్డి పశువులకు నట్టల మందు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం పశువైద్య అధికారి బాబురావు మాట్లాడుతూ.... వర్షాలు అధికంగా కురవడంతో గట్ల పైన పెరిగిన గడ్డి గేదెలు తినడంతో వాటికి నట్టలు తయారవుతాయని, దీనితో వాటి జీర్ణ శక్తి తగ్గి పెరుగుదల కుంటు పడుతుందని, వెంటనే నట్టల నివారణ మందులు వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి అల్లిపురం రాజవ్వ, సిబ్బంది శ్రీనివాస్, చంద్రశేఖర్, సతీష్, వార్డు సభ్యులు, పాడి రైతులు పాల్గొన్నారు.

మోపాల్: మండలంలో 764 పశువులకు వెటర్నరీ డాక్టర్ ప్రమోద్ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్పిటిసి కమలా నరేష్ హాజరు ఆయ్యారు. పశువులకు కచ్చితంగా గాలి టీకాలు వేయించాలని కోరారు.

కార్యక్రమంలో సర్పంచ్ క్యాతం రవి, పశు వైద్య సిబ్బంది మహేందర్, చిత్ర, సాయి, రజనీకాంత్, జావేద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెత్తచెదారం.. దుర్గంధం


కాలువలో పేరుకుపోయిన చెత్త

నవతెలంగాణ-జుక్కల్

మండల కేంద్రంలోని గుండూర్ వెళ్లే మార్గంలోని గ్రామీణ బ్యాంకు సమీపంలో చెత్తచెదారంతో దుర్గంధం వెదజల్లుతోంది. చుట్టు పక్కల గల మటన్, చికెన్ మాంసం విక్రయించే దుకాణదారులు, కూరగాయలు విక్రయించేవారు, చాట్‌బండ్‌లు నడిపేవారు వారు, ఇతర వ్యాపారులు చెత్తచెదారాన్ని గుండూర్ వెళ్లే మార్గ సమీపంలో వేయడంతో అపరిశుభ్రంగా మారుతోంది. ఆ రోడ్డు గుండా వెళ్లే వాహనదారులకు, పాదచారులకు దుర్వాసన వెదజల్లుతోంది. ముక్కు మూసుకొని పోయే దుస్థితి నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులు నిత్యం వెళ్లే రహదారి అయినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ ప్రాంత సమీపంలో నివాసముంటున్న వారు దుర్గంధం భరించలేక ఇళ్లు ఖాళీచేసి పోయే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్, అధికారులు సమస్యను పట్టించుకుని వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

విధి నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి


మొక్కలు నాటుతున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-పిట్లం

విధి నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖలన్నింటిలోనూ పోలీస్ వ్యవస్థ కీలకమైనదని, సేవా దృక్పథంతో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు చూరగొనాలని చెప్పారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల పట్ల శాంతి భద్రతలలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలని, నేరాల నివారణకు గ్రామాలలో ప్రజల, నాయకుల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. దొంగతనాల నివారణకు సంసిద్ధులై ఉండాలన్నారు. ముందుగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, స్టేషన్ ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటరు. అనంతరం రికార్డ్స్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాన్సువాడ డి.ఎస్.పి జగన్నాథ్‌రెడ్డి, సీఐ మురళి, ఎస్సై విజయ్ కొండ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

- పీడీఎస్‌యూ

నవతెలంగాణ-తాడ్వాయి

వాతావరణంలో వచ్చిన పెను మార్పులతో వైరల్ వ్యాధులు వస్తున్నాయని, వీటిల్లో నేత్ర సంబంధ సమస్యలు అధికంగా ఉన్నాయని ఇటీవల దవాఖానాలను ఆశ్రయిస్తున్న 'కండ్ల కలక బాధితులలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉందని పీడీఎస్‌యూ కామారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా వైద్యశాఖ అధికారులకు వినతి పత్రాన్ని మంగళవారం అందజేశారు. అనంతరం పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి జి.సురేష్ మాట్లాడుతూ.. మొన్నటి వరకు అధిక ఉష్ణోగ్రతలు.. ఇప్పుడు తెరిపివ్వని వానలు.. వెరసి వాతావరణంతో వచ్చిన పెను మార్పులు వైరల్ వ్యాధులను విద్యార్థులపై వెంటేసుకొస్తున్నాయన్నారు. వీటిల్లో నేత్ర సంబంధ సమస్యలు అధికంగా ఉన్నాయని ఇటీవల దవాఖానాలను ఆశ్ర యిస్తున్న 'కళ్ల కలక బాధితుల సంఖ్య గురుకుల, మసతి గృహాల, విద్యార్థులే అధికంగా ఉన్నారని తెలిపారు. తక్షణమే జిల్లా వైద్యశాఖ అధికారులు, విద్యాశాఖ గురుకుల అధికారులు స్పందించి ప్రభుత్వ గురుకులాలు వసతి గృహాలు, విద్యాసంస్థలలో ఉంటున్న విద్యార్థులకు వైద్య శిబిరాల ద్వారా అన్నిరకాల సదుపాయాలు, మందులు అందుబాటులో ఉంచాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా కార్యదర్శి బి.అనిల్, సహాయ కార్యదర్శి కృష్ణ, జిల్లా నాయకులు రాకేష్ పాల్గొన్నారు.

పేదల సమస్యలపై పోరాటమే వారికి నివాళి

- సీపీఐ(ఎం)నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు
- హరికిషన్ సింగ్ సూర్జిత్, కే.కృష్ణమూర్తిల వర్ధంతి



నివాళి అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన హరికిషన్ సింగ్ సూర్జిత్ 15వ వర్ధంతి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ కృష్ణ మూర్తి వర్ధంతిని నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఇరువురి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ. రమేష్ బాబు మాట్లాడుతూ.. భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన హరికిషన్ సింగ్ సూర్జిత్ రైతాంగ ఉద్యమ నిర్మాత భారతదేశ స్వతంత్ర ఉద్యమంలో కీలకమైన పాత్ర పోషించి అనేక పోరాటాల్లో అగ్రభాగాన ఉన్న నాయకుడని అన్నారు. సిపిఎం పార్టీ ప్రారంభం లో ఒకరుగా ఉంటూ సుదీర్ఘ కాలంపాటు రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శుల బాధ్యతల్లో, సిపిఎం పార్టీ పోలీస్ బ్యూరో సభ్యులుగా, అఖిలభారత ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ అనేక ఉద్యమాలు నిర్వహించి కార్మిక వర్గ రాజ్య స్థాపన ద్వారానే దోపిడీ లేని రాజ్యం ఏర్పడుతుందని అందుకు కమ్యూనిస్టు పార్టీ నిర్మాణమే మార్గం అని చివరి వరకు కృషి చేశారని తెలిపారు. ఆయన చూపిన మార్గంలో నేటికీ అట్టడుగు వర్గాల ప్రజలను కదిలిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఎం పార్టీ పనిచేస్తుందని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కీలకమైన వ్యక్తిగా పనిచేసిన కృష్ణమూర్తి భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి దున్నేవాడికే భూమి కావాలని నినదించి చివరి వరకు వ్యవసాయ కార్మికుల పక్షాన పేదల పక్షాన పోరాటాలు నిర్వహించారని అన్నారు. వారి ఆశయ సాధనకోసం పార్టీ భూ పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ద రాములు , ఎం. గోవర్ధన్, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, పెద్ది సూరి, కళావతి, ఆసిఫ్ పాల్గొన్నారు.

అన్నాబావు సాటే స్ఫూర్తితో సామాజిక విప్లవం కోసం ఉద్యమించాలి

- బీఎల్‌పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో నాయకుడిగా, రచయిత, కవి, అంబేద్కర్ భావజాల దృక్పథప్రచారకుడిగా మహోన్నత వ్యక్తిత్వం కలిగిన అన్నాభావు సాతే స్ఫూర్తితో సామాజిక విప్లవం కోసం ఉద్యమించాలని బీఎల్‌పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ పిలుపునిచ్చారు. మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గౌతమ్ నగర్‌లో నిర్వహించిన అన్నాభావు సాతే 103వ జయంతి నిర్వహించారు. బహుజన మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత మాట్లాడుతూ.. బహుజన శ్రామిక మహిళలు శ్రమ దోపిడి తోపాటు బహుజన రాజ్యాధికారంలో మహిళలు సమాన వాటా కోసం ఉద్యమించండం ద్వారా అన్నాభావు సాతే కు నిజమై నివాళులు అర్పించిన వారం అవుతామన్నారు. కార్యక్రమంలో అన్నాభావు సాతే మాదిగ సంఘం నిజామాబాద్ నగర నాయకులు సిహెచ. రాజు, కాంబ్లీ సాయి, గాయక్వాడ్ కేశవ్, గంగాధర్ గాయక్వాడ్ , సంతోష్ వాగ్మారే, భాస్కర్ సూర్య వంశీ , కరణ్ సూర్య వంశీ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకులపాపయ్య


సిరికొండ : మాట్లాడుతున్న ఆకుల పాపయ్య

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి/సిరికొండ

ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి, గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో 27వ రోజు సమ్మెలో మంగళవారం పాల్గొని మాట్లాడారు. వేతనాలు పెంచి క్రమబద్ధీకరించాలని జూలై 6 నుండి నిరవధిక సమ్మెచేస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన అన్నారు. సమ్మెలో రాష్ట్ర జేఏసీ కన్వీనర్ దాసు ఐఎఫ్టీయు జిల్లా ఉపాధ్యక్షులు సూర్య శివాజీ కార్యదర్శి శివకుమార్, భానుచందర్, సాయన్న,సొప్పరి గంగాధర్, గున్నవా, భోజమ్మ, శ్రీనివాస్, పప్పు, మురళి, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: మండల కేంద్రంలో సమ్మె శిబిరాన్ని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య సందర్శించి మాట్లాడారు. 27రోజులుగా సమ్మెతో గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత అస్తవ్యస్తంగా తయారైందని, కాలయాపన మాని పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో రాష్ట్ర జేఏసీ కన్వీనర్ దాసు, ఐఎఫ్టియు జిల్లా కార్యదర్శి శివకుమార్, జీపీ గంగాధర్, బాలయ్య , ఏఐకేఎంఎస్ ఆర్మూర్ డివిజన్ సెక్రెటరీ మార్క్స్, ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షులు నిమ్మల భూమేష్, ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య, విలేజ్ కమిటీ అధ్యక్షులు గులాం హుస్సేన్, పి వై ఎల్ మండల ప్రధాన కార్యదర్శి మల్కి సంజీవ్ పాల్గొన్నారు.

అన్నాబాహుసాటే 103వ జయంతి వేడుకలు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని దోస్పల్లి గ్రామంలో సర్పంచ్ సునితా పటేల్ అధ్యక్షతన అన్నాబాహు సాటే 103వ జయంతి వేడుకలను గ్రామస్తులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నాబాహు సాటే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పింకాబాయి, జేపీఎస్ జాదవ్ మనోహర్, గ్రామస్తులు పాండురంగ్ పటేల్, కేశవ్ పటేల్, జ్ఞానేశ్వర్, నామ్‌దేవ్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

కండ్ల కలక అంటు వ్యాధి

- నివారణపై అవగాహన కల్పించాలి
- ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్


కళ్లకలకలపై అవగాహన కల్పిస్తున్న వై.శంకర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇందల్ వాయిలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య కార్యకర్తలతో కళ్ళ కలక కు సంబంధించి సమీక్ష సమావేశం, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కండ్ల కలక వైరస్ లేదా బ్యాక్టీరియా కారణంగా కళ్ళల్లో ప్రభావితం చేసే ఒక రకమైన అంటువ్యాధి అని, ఇది వరదలు, వాతావరణ మార్పుల కారణంగా కంటి కలక రోగులు పెరుగుతూ ఉన్నారని తెలిపారు. కళ్ళుఎరుపు, ఎరుపు మూతలు, వాపు, దురద కంటిలో ఉంటుందని కనురెప్పలు అంటుకొని ఉండవచ్చని పిల్లలను జ్వరం కూడా ఉంటుందని చెప్పారు. కంటి చుక్కలు వైద్యుని సలహా మేరకు వాడాలన్నారు. శుభ్రమైన తువాలు, బెడిషీట్ వాడాలని, కళ్ళుకలక సోకిన వ్యక్తి ఇతరులకు దూరంగా ఉండాలని చెప్పారు. రద్దీ ఉండే ప్రదేశాలను తిరగొద్దని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు అక్బర్ అలీ, ఉమా రాణి, ఆనంద్, సునీత, స్వరూప, విజయలక్ష్మి ఫార్మసిస్ట్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈడిపి సెక్షన్‌కు డాక్టర్. బి. నందిని నియామకం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ ఇంచార్జీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వాకాటి కరుణ ఐఏఎస్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. యాదగిరి డాక్టర్.బి నందినికి అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ (ఈడీపీ)సెక్షన్‌కు నియామక ఉత్తర్వులను మంగళవారం అందజేశారు. గతంలో డాక్టర్ బి.నందిని అసిస్టెంట్ కంట్రోలర్. ఉమెన్ సెల్ డైరెక్టర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామర్‌గా, బాలికల వసతి గృహానికి వార్డెన్‌గా, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెల్‌కు డైరెక్టర్‌గా సిబిటి కోఆర్డినేటర్‌గా కంప్యూటర్ సైన్స్ హెడ్, బిఓఎస్‌గా పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌గా విజయవంతంగా విధులు నిర్వహించారు.

IN THE COURT OF HON'BLE PRL. JUNIOR CIVIL JUDGE AT NIZAMABAD
O.S. NO. 217 OF 2022

Between:-
Indian Bank, Khaleelwadi branch
....Plaintiff

And

Smt. Gaichand Bobby and another,
...Defendents

To,
Smt. Gaichand Bobby, W/o Rajesh Kumar, age 40 years, R/o H.No. 10-9-221, Anandnagar, Varni Road, Nizamabad **(Defendant No. 1)**

That the plaintiff bank filed above case for recovery of amount of Rs. 1,22,505/- against the defendant No. 1 & 2. The notices was sent to defendant No.1 address unserved.

Whereas the above O.S. is posted for your appearance on 11-08-2023 at 10-30 A.M. before the Hon'ble court, failure of which the case will be heard and decided exparte.

(BY ORDER OF THE COURT)

M. GOVARDHAN
G. NARAYANA DAS
ADVOCATES
NIZAMABAD.
CELL NO. 94407 43423

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT NIZAMABAD
ARB.No. 115 of 2023

Between:
M/s.Mahija Chit Fund Pvt. Ltd., Nizamabad represented by its Foreman/Director Mr.K.Srinivasa Rao.
.. Disputant

And

Bandanakanti Ravinder and others
.. Opponents

To

Opp.No.1 Bandanakanti Ravinder S/o.Durgadas, aged about 49 years, Occ: Business, R/o.H.No.10-11-1062, Boigally, Gajulpet, Nizamabad. Cell: 9059055634

Opp.No.2 Koyyala Vinod S/o.Chinnaiah, aged about 50 years, Occ: Business, R/o.H.No.3-3-588/6A, Sainagar, Nizamabad. Cell: 9000333008

Opp.No.3 Chakinala Balaji S/o.Veeraiah, aged about 53 years, Occ: Service, Line Inspector, O/o.DEE/OP/TSNPD-CL, Nizamabad. Cell: 9346416974

Opp.No.4 Vuppala Sunil Kumar S/o.Vasanth Rao, aged about 53 years, Occ: Service, Junior Assistant, Senior Civil Judge Court, Bodhan, Dist: Nizamabad. Cell: 8341496966

Opp.No.5 Mulka Saidi Reddy S/o.Venkat Reddy, aged about 49 years, Occ: Business, R/o.H.No.1-12-125/4/A1, Srinagar Colony, Vinayak Nagar, Nizamabad. Cell: 9381943160

The Disputant has filed the dispute for recovery of amount and notices sent on your addresses were returned unserved. Whereas the dispute is posted for your appearance on 16.08.2023 at 11.00 A.M. You are called upon hereby to appear in person before the Hon'ble Deputy Registrar of Chits/Arbitrator, Nizamabad on the said date failure of which the dispute will be heard and decided exparte.

// By Order of the Deputy Registrar of Chits/Arbitrator //

Sd/-
Deputy Registrar of Chits/Arbitrator,
Kavitha Complex,
Nizamabad.